బడి నుంచి కాలేజీకి..!

- ఎన్నో ఆశలు, ఆశయాలతో కళాశాలల్లో చేరిక
- కొత్త స్నేహితులతో పరిచయాలు
- ఇంటర్ విద్య భవిష్యత్తుకు తొలిమెట్టు



కెరమెరి ప్రభుత్వ జూనియర్ కాలేజీ



కాలేజీ నుంచి ఇంటికి బయలుదేరుతున్న ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు

కెరమెరి: కాలేజీ అంటేనే చదువు, సరదా, స్నేహాలు. కొత్తవాళ్లు వచ్చారంటే కాసింత హడావుడి, కాసింత ఉత్సాహం తప్పదు. అలాంటి హంగామానే ప్రస్తుతం కొత్తగా కళాశాలల్లో చేరిన విద్యార్థుల్లో కన్పిస్తోంది. మండలానికి సమీప గ్రామాలకు చెందిన విద్యార్థులు కొత్తగా కాలేజీల్లో చేరి ఉదయం కాగానే కళాశాలకు తోటి స్నేహితులతో కలిసి వెళ్తున్నారు. నూతన విద్యార్థులకు సీనియర్లు చప్పట్లతో స్వాగతం చెబుతున్నారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఫస్ట్ ఇయర్‌లో 145 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. వారంతా మోడి, ఝరి, స్వాంగి, సావర్‌ఖెడ, కెలిబి, కెరమెరి, అనార్‌పల్లి తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు.

సరికొత్త ఆశలతో..

మొన్నటి వరకు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సరికొత్త ఆశలతో కళాశాలలో అడుగుపెట్టారు. ఇంత వరకు క్రమశిక్షణతో పాఠశాల చదువులు పూర్తి చేసుకున్న విద్యార్థులు, ఇన్నాళ్లు ఇంటి అనుబంధంతో అమ్మానాన్నల మధ్య ఉన్నవారు ప్రస్తుతం కళాశాలల్లో చేరి కొత్త స్నేహితులతో కొత్త వాతావరణానికి అలవాటు పడుతున్నారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియెట్ విద్య వారి భవిష్యత్తుకు తొలిమెట్టు కావడంతో ఈ దశ విద్యార్థులకు కీలకమని వ్యక్తిత్వ వికాస నిపుణులు, అధ్యాపకులు పేర్కొంటున్నారు. అందుకే పాఠశాల చదువులు పూర్తి చేసుకుని కాలేజీలో చేరిన విద్యార్థులకు మొదటగా కెరీర్ గైడెన్స్‌పై సలహాలు, సూచనలు ఇస్తున్నామని లెక్చరర్లు చెబుతున్నారు.

నూతనంగా చేరిన వారు పాటించాల్సిన అంశాలు..

- నచ్చిన కోర్సులో చేరి పూర్తి నిబద్ధతతో ఉండాలి.
- క్లాసులకు రెగ్యులర్‌గా హాజరవుతూ అసైన్‌మెంట్లు సమయానికి పూర్తి చేయాలి.
- పరీక్షలకే కాదు ప్రాక్టికల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు స్పష్టంగా మాట్లాడాలి.
- ఆలోచనలు, అభిప్రాయాలు ఇతరులకు చెప్పేందుకు వెనుకాడొద్దు.
- ఇతరుల పట్ల గౌరవంగా ఉండాలి.
- సానుకూలమైన ప్రోత్సహించే స్నేహితులను ఎంచుకోవాలి.
- గాసిప్స్, నెగెటివిటీకి దూరంగా ఉండాలి.
- కొత్త స్కిల్స్ (భాషలు, సాంకేతికత, కమ్యూనికేషన్) నేర్చుకోవాలి.

భయంగా అనిపించింది



కాలేజీ అంటే మొదట్లో భయం అనిపించింది. లెక్చరర్లు అర్థమయ్యే విధంగా బోధన చేయడంతో కాలేజీలో ఫలితాలు బాగున్నాయని తెలిసి జాయిన్ అయ్యాను. పాఠశాల స్నేహితులు దూరమయ్యారని కొంత బాధగా ఉంది. కాలేజీ బాగుంది. – సునీత, బైపీసీ

ఎంతో తేడా..



పాఠశాలలో కొంత అల్లరితో చిలిపితనంతో ఉండేవాళ్లం. కాలేజీకి, స్కూలుకు ఎంతో తేడా ఉంది. కాలేజీలో చేరిన తర్వాత కొంత మార్పు వచ్చింది. కొత్త స్నేహితుల పరిచయాలతో వ్యక్తిత్వ వికాసం పెంపొందేందుకు అవకాశం ఉంది. – అంజలి, ఎంపీసీ

సలహాలు ఇస్తున్నాం..



పాఠశాల నుంచి కాలేజీలో చేరిన విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్‌పై సలహాలు ఇస్తున్నాం. మానవ అక్రమ రవాణా వ్యతిరేక చర్యలపై అవగాహన కల్పిస్తున్నాం. లా, ఇంజినీరింగ్, ఎంబీబీఎస్‌పై త్వరలో ఫిజిక్స్‌వాలా, ఖాన్ అకాడమీ ద్వారా పాఠాలు బోధిస్తాం. – అస్మత్ అలీ, ప్రిన్సిపాల్

గుంతల్లో వర్షపు నీరు



పెంచికల్‌పేట్ -సలుగుపల్లి రహదారిలో గుంతల్లో చేరిన వర్షపు నీరు



చెరువును తలపిస్తున్న లగ్గామ -దహెగాం రహదారి

పెంచికల్‌పేట్: ప్రధాన రహదారుల్లో ఏర్పడిన పెద్ద గుంతల్లో వర్షపు నీరు చేరడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. పెంచికల్‌పేట్ -సలుగుపల్లి, లగ్గామ -దహెగాం రహదారుల్లో వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

క్లుప్తంగా

అన్నదాన సత్రంలో ప్రత్యేక పూజలు



అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణం బస్టాండ్ సమీపంలోని కోనేరు కోనప్ప నిత్యన్నదాన సత్రం వార్షికోత్సవం సందర్భంగా సత్రంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప -రమాదేవిల ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సహస్ర పారాయణం నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలను తొలగించాలని తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ గ్రామపంచాయతీలో ఉన్న ఎస్టీ జనాభాను తొలగించాలని కోరుతూ పెంచికల్‌పేట్ గ్రామస్తులు తహసీల్దార్ పుష్పలతకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెంచికల్‌పేట్ పంచాయతీలో ఒక్కరు కూడా ఎస్టీలు లేరని, 2011 జనాభా లెక్కల ప్రకారం అధికారులు ఎస్టీ జనాభాను కలిపారని, పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. గతంలో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో అధికారుల తప్పిదంతో ఒక వార్డు ఎస్టీకి రిజర్వు చేశారన్నారు. వెంటనే అధికారులు విచారణ చేసి ఎస్టీ జనాభాను పంచాయతీ జాబితా నుంచి తొలగించాలన్నారు. గ్రామస్తులు మేకల ఇస్తారి, పాముల నందు, మేకల హన్మంతు, పురుషోత్తం, మేకల శేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



పోలీస్‌స్టేషన్ వద్ద బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని పెద్దమ్మ గుడి కూల్చివేతను ఖండిస్తూ మంగళవారం హైదరాబాద్‌లో బీజేపీ తలపెట్టిన ఆందోళన కార్యక్రమానికి వెళ్లకుండా స్థానిక బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో స్థానిక బీజేపీ నాయకులు అరిగెల మల్లికార్జున్, సుంకరి పెంటు, ప్రసాద్ గౌడ్, జయరాజ్ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కాగజ్‌నగర్‌టౌన్: కొత్తపల్లి వెంకట లక్ష్మి -చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ, కొత్తపల్లి శ్రీనివాస్ -అనితల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. కంటి వైద్య శిబిరంలో 27 మందికి పరీక్షలు నిర్వహించగా 14 మందిని శస్త్రచికిత్సలకు బెల్లంపల్లికి రిఫర్ చేసి లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ శ్రీనాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి తదితరులు ఉన్నారు.

'పాలగోరి ఆదివాసీల జోలికి వస్తే సహించేది లేదు'

జైనూర్: పాలగోరి ఆదివాసీల జోలికి వస్తే సహించేది లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గోండ్వాన రాజ్యపరిపాలన కాలం నుంచి మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పాలగోరి గ్రామంలో ఉంటున్నారన్నారు. పాలగోరి గ్రామంలోని 35 మందిపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. తక్షణమే ఆదివాసీలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలన్నారు. విద్యార్థి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సెద్మకి భగవంత్‌రావు, జిల్లా సలహాదారుడు సోనేరావు, తొడసం రమేశ్, గేడం బాలు తదితరులు ఉన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



దహెగాం: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏవో రామకృష్ణ



పెంచికల్‌పేట్: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో శ్రీవిద్య

దహెగాం: కొత్తగా పట్టా పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏవో రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతుల నుంచి రైతుబీమా దరఖాస్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, నామినీ వివరాలతో ఈనెల 13 వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: కొత్తపట్టా పాసుపుస్తకాలు వచ్చిన రైతుల నుంచి రైతుబీమా కోసం ఏఈవోలు దరఖాస్తులను స్వీకరించారు. వారు మాట్లాడుతూ నూతన పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, నామినీ వివరాలతో దరఖాస్తులతో సమర్పించాలని కోరారు. ఈనెల 13 వరకు అవకాశం ఉన్నందున అర్హులైన రైతులు వినియోగించుకోవాలని కోరారు.

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా పథకానికి అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ మనోహర్, ఏవో రామకృష్ణలు అన్నారు. మంగళవారం మండలంలోని దుర్గానగర్ రైతువేదికలో రైతులకు రైతుబీమాపై అవగాహన కల్పించారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

బెజ్జూర్: ఇందిరమ్మ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. బెజ్జూర్ గ్రామ పంచాయతీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మంగళవారం కార్యదర్శి వైకుంఠంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులతో మాట్లాడారు. పనులను త్వరగా పూర్తి చేయాలని, పునాది వరకు నిర్మించుకున్న లబ్ధిదారులకు వారి ఖాతాలో మొదటి దఫా రూ.లక్ష జమ చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఇందిరమ్మ కమిటీ సభ్యులు షణ్ముక తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో ఖాళీగా ఉన్న ఫిజికల్ సైన్స్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నలంద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు సంబంధిత సర్టిఫికెట్లతో ఈ నెల 14వ తేదీ లోపు కేజీబీవీలో వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ, బీఈడీలో ఫిజికల్ సైన్స్‌లో మెథడాలజీ, టెట్ పాసయ్యి ఉండాలన్నారు.

క్రీడల్లో రాణించాలి

నార్నూర్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని హెచ్‌ఎం జాదవ్ విట్టల్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ క్రీడా నైపుణ్యాన్ని ఏర్పచుకోవాలన్నారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడీ ఆడే విశ్వనాథ్, వార్డెన్ వనిత, పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఇగురపు విఠల్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగేపల్లి గ్రామంలో స్థానిక పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు ఆసరా పింఛన్‌లు పెంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్‌దారుల సమస్యలు పరిష్కరించడంతో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. ఈ నెల 21న కౌటాల జగదాంబ గార్డెన్‌లో తలపెట్టిన పెన్షన్‌దారుల సన్నాహక సమావేశానికి పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో నాయకులు పిట్టల సత్యనారాయణ, రాజేశ్, జ్యోతిరావు, మల్లయ్య, పున్నజీ, విజయ్‌కుమార్, శశికళ, అక్కుబాయి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



పిట్టగోడ లేక ప్రమాదకరంగా కల్వర్టు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని న్యూ కాలనీ నుంచి టీచర్స్ కాలనీకి వెళ్లే మార్గంలోని ప్రధాన మురుగు కాలువ కల్వర్టుకు ఇరువైపుల పిట్టగోడ లేకపోవడంతో ద్విచక్రవాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. న్యూకాలనీలోని గణేశ్‌మందిర్ సమీపంలో మూలమలుపు ప్రమాదకరంగా ఉండడంతో అటు నుంచి వచ్చే ద్విచక్రవాహనదారులు అదుపు తప్పితే కాలువలో పడే ప్రమాదముంది. అధికారులు స్పందించి కల్వర్టుకు పిట్టగోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి



గుంతలమయంగా జన్కాపూర్ ప్రధాన రహదారి

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రహదారిపై మరిన్ని గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రహదారికి వెంటనే మరమ్మతులు చేయించాలని సీపీఎం నాయకులు గొడిసెల కార్తిక్, టీకానంద్ కోరారు. మంగళవారం వారు రోడ్డును పరిశీలించారు.

అర్హులైన రైతులకు రుణ సదుపాయం కల్పించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: జిల్లాలో అర్హులైన రైతులకు రుణ సదుపాయం కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం చేతన్ గోరేకర్, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, డీఆర్‌డీవో దత్తారావు, ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లాస్థాయి త్రైమాసిక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లు అర్హులకు రుణసదుపాయం కల్పించి వారి అభివృద్ధికి తోడ్పాడాలని అన్నారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం రుణాలు అందించాలని, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ప్రక్రియ పూర్తి చేసి కొత్త రుణాలు ఇవ్వాలని సూచించారు. పీఎం విశ్వకర్మ పథకంలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి రుణాలు అందించాలని, చిన్న చిన్న కారణాలతో దరఖాస్తులు తిరస్కరించొద్దన్నారు. గిరిజన సంక్షేమ, షెడ్యూల్డ్ కులాల సంక్షేమ రుణాల మంజూరులో బ్యాంకులు జాప్యం చేయొద్దన్నారు. సమావేశంలో నాబార్డు డీడీఎం వీరభద్రుడు, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజియన్ మేనేజర్ ప్రభుదాస్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సుమంత్‌రెడ్డి, డీటీడబ్ల్యూవో రమాదేవి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సెర్ప్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని వాడిగూడ పాఠశాలను మంగళవారం సందర్శించారు. పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు.

ఐక్య పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న సంఘం నాయకులు

బెజ్జూర్: ఆదివాసీలు ఏకతాటిపైకి వచ్చి పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని కోయ సంఘం జిల్లా అధ్యక్షుడు సోయం చిన్నన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో మండల గౌరవ అధ్యక్షుడు కోరేత తిరుపతితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తులో నిర్వహించబోయే కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో మండల కమిటీతో పాటు గ్రామస్థాయిలో గ్రామ కమిటీలు ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 5 వరకు గ్రామాల వారీగా పర్యటనలు చేసి, సెప్టెంబర్ 7న మండల పూర్తిస్థాయి కమిటీ వేస్తామన్నారు. నాయకులు రాజారామ్, అమృత, హనుమంతు, నారాయణ, అశోక్, పురుషోత్తం, రామయ్య, రమేశ్, బానయ్య, గంగారాం, శంకర్, కలంగిరి, సుధాకర్, కళ్యాణ్, తిరుపతి, మాంతయ్య, పేదమ్ విట్టయ్య, మడవి, సుదర్శన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రలైజేషన్ విధానాన్ని రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

కాగజ్‌నగర్‌టౌన్: ప్రభుత్వం వసతి గృహాల్లో ఏర్పాటు చేసే సెంట్రలైజేషన్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ మంగళవారం సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లాకు జిల్లా కాంట్రాక్టర్లు వినతిపత్రం అందజేశారు. సెంట్రలైజ్ విధానంతో కాంట్రాక్టర్లు రోడ్డున పడుతారని, ఇప్పటికే ఏప్రిల్ నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదని తెలిపారు. బిల్లులు రాకుండా నిత్యవసర సరకులు, క్యాటరింగ్ కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. కాంట్రాక్టర్లు బొమ్మెల శ్రీనివాస్, పైడి సంతోష్, సమీర్, ధన్‌రాజ్, రియాజ్, షకీర్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎస్ఆర్ రంగనాథ్ జయంతి



వాంకిడి: రంగనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న లైబ్రేరియన్, పాఠకులు

వాంకిడి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఎస్ఆర్ రంగనాథ్ జయంతిని ప్రతీ సంవత్సరం గ్రంథాలయ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సదానందం, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి..

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ శారద అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్ఆర్ రంగనాథ్ జయంతి సందర్భంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. పుస్తక పఠనంతో జ్ఞానం, మంచి సంస్కృతి అలవాటు చేసుకోవచ్చన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ జనార్దన్, అధ్యాపకులు హేమాజి, సంతోష్, మహాలక్ష్మయ్య, మహేశ్, కృష్ణవేణి, రజిత, స్రవంతి, నర్సింగ్‌రావు, గ్రంథాలయ అధ్యాపకుడు దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.